క్లుప్తంగా

యాదాద్రిలో కందూర్ భజన బృందం

అడ్డాకుల: యాదాద్రి దివ్యక్షేత్రానికి మంగళవారం కందూర్ శ్రీరామలింగేశ్వర భజన బృందం తరలి వెళ్లింది. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో అఖండ భజనలు చేపట్టడంతో కందూర్ భజన బృందానికి అందులో పాల్గొనే అవకాశం దక్కింది. ఉదయం, రాత్రి రెండు సార్లు ఆలయంలో కొనసాగుతున్న అఖండ భజనలో బృందం పాల్గొన్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, శంకరయ్య, దేవన్న యాదవ్, మారుతి యాదవ్, శ్రీనివాసులు, చెన్నయ్య, బాల స్వామి, ఎల్లారెడ్డి, శ్రీరాములు, డబ్బ అంజి తదితరులు ఉన్నారు.

26న సర్వసభ్య సమావేశం

మిడ్జిల్: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న ఎంపీపీ సుదర్శన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంగళవారం సాయిలక్ష్మి తెలిపారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని సూచించారు.

కీర్తి పురస్కారంపై హర్షం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రముఖ కవి, రచయిత డాక్టర్ వెల్దండ వెంకటేశ్వరరావుకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారాన్ని ప్రకటించడం పై పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య తంగెడ కిషన్ రావు చేతులమీదుగా డాక్టర్ వెల్దండ వెంకటేశ్వరరావుకు ఈ పురస్కారాన్ని అందుకుంటారని ఆయన వివరించారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో జైలుశిక్ష

అడ్డాకుల: మద్యం మత్తులో వాహనాన్ని నడిపిన వరుణ్‌రెడ్డిని కోర్టులో మంగళవారం హాజరు పర్చగా 3 రోజుల జైలుశిక్ష, రూ.25,00 జరిమానా విధించినట్లు అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. గోపన్‌పల్లికి చెందిన కె.వరుణ్‌రెడ్డి ఇటీవల మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ పట్టుబడినట్లు వివరించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన చెన్నయ్య మూడునెలల క్రితం మృతిచెందాడు. ఈ నేపథ్యంలో ఆయనతో పాటు 1999లో పదో తరగతి చదివిన మిత్రులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. రూ. 80వేలు పోగు చేసి మంగళవారం ఆయన కుమార్తెలు రమ్యశ్రీ, అలివేలు పేరున రూ.40వేల చొప్పున పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు. అదేవిధంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. బి. గోపాల్, రంజాన్, కేశవులు, మన్సూర్, రఘు, ఆషద్, రంగయ్య, శివరాములు, హైమద్ పాల్గొన్నారు.

7, 8 వార్డుల్లో ఫాగింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దోమల నివారణ కోసం స్థానిక 7, 8వ వార్డుల్లో మంగళవారం మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక వాహనం ద్వారా ఫాగింగ్ చేశారు. టీచర్స్ కాలనీ, పద్మావతికాలనీ, వడ్డెరబస్తీ, ధనలక్ష్మికాలనీ, పంచాయతీరాజ్‌కాలనీ, ప్రశాంత్ నగర్‌లలో ఈ కార్యక్రమం చేపట్టారు.

పాఠశాలకు టీవీ వితరణ

బాలానగర్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆదిరమణారెడ్డి తన సోదరుడు అవనీంద్ర రెడ్డి చేత పెద్దరేవల్లి ప్రాథమిక పాఠశాలకు ఎల్ఈడీ టీవీ మంగళవారం అందజేశారు. హెచ్ఎం అనిల్ కుమార్, గ్రామపెద్దలు వెంకటయ్య, ఎలేష్, నవీన్ రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొని దాతలను అభినందించారు.

చెక్‌డ్యాంలో కళేబరం

చిన్నచింతకుంట: మండల కేంద్రం సమీపంలోని చెక్‌డ్యాంలో పంది పడి మృతి చెందిందని స్థానికులు మంగళవారం తెలిపారు. దీంతో గ్రామానికి అందే తాగునీరు కలుషితమైందని వాపోతున్నారు. ఆ నీటిని తాగితే రోగాల బారిన పడే అవకాశం ఉందని అంటున్నారు. చెక్‌డ్యాం సమీపంలో కొందరు పందుల పెంపకం చేపట్టడం వల్లే ఘటన జరిగిందని, పెంపకాన్ని నివారించాలని అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. కాగా మిషన్ భగీరథ కాకుండా చెక్‌డ్యాంలోని ఊటబావుల ద్వారా అధికారులు తాగునీటిని అందిస్తున్నారని వివరించారు.

ప్రాధాన్యత ఏదీ?

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్లలో మహిళలకు చాలా తక్కువగా కేటాయించారని జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత ఆరోపించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో 33 శాతం మహిళా రిజర్వేషన్‌పై ధర్నా చేశారని, తక్కువ సీట్లు కేటాయించడంపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం సీట్లు ఇచ్చింది కాంగ్రెస్సేనని అన్నారు. త్వరలో ప్రియాంకగాంధీ మహిళా డిక్లరేషన్‌ను ప్రకటిస్తారని వివరించారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బాదేపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



చక్రాపూర్‌లో..

జడ్చర్ల టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. మున్సిపాలిటి పరిధిలోని బాదేపల్లి ఊరకుంట పోచమ్మ, జడ్చర్ల పోచమ్మ దేవాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మేళతాళాలతో సంప్రదాయ నృత్యాలు చేస్తూ బోనాల ఊరేగింపు చేపట్టారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లోనూ పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, టీపీసీసీ నాయకుడు అనిరుధ్‌రెడ్డి తదితరులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు.

అడ్డాకుల: మూసాపేట మండలంలోని వేముల, తుంకినీపూర్, జానంపేట, చక్రాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచులు అరుణ, శైలజారెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మణ్, మహిళలు ఉన్నారు.



జడ్చర్ల పాతబజార్ గాంధీబొమ్మ వద్ద..



జడ్చర్లలో తొట్టెలతో వెళ్తున్న భక్తులు



తిమ్మాపూర్‌లో..

బోనాలకు ముస్తాబైన చౌడమ్మ గుట్ట

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల, దాయపంతులపల్లి, రుక్కంపల్లి, సీతమ్మతండా, తూక్యతండాల ప్రజలు సామూహికంగా నిర్వహించే బోనాలకు యన్మన్‌గండ్ల చౌడమ్మ గుట్ట ముస్తాబైంది. గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శ్రావణమాసంలో బుధవారం చౌడమ్మ గుట్టలో బోనాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున బోనాలు శకటోత్సవాలు నిర్వహిస్తారు.



యన్మన్‌గండ్ల చౌడమ్మ గుట్ట

ఘనంగా ప్రారంభమైన వార్షికోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు తరిమళ శంకర్ శర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, గణపతి పూజ, నవగ్రహ మండపారాధన, మహామంగళ హారతితో పాటు ధ్వజ స్తంభ పూజలు నిర్వహించారు. ధ్వజారోహణం చేశారు. మహిళలు, ఆర్యవైశ్య నాయకులు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కల్వ కన్నయ్య, జిల్లా విశ్వహిందు పరిషత్ అధ్యక్షులు చంద్రయ్య, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల, హరికాంత్, ప్రకాశ్ బాబు, నాగయ్య, నాగులు తదితరులు ఉన్నారు.

నేడు 108 కలశాలతో అభిషేకాలు..

వార్షికోత్సవాల్లో బుధవారం 108 కలశాలతో ఊరేగింపు, అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ ఉంటాయన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



మహబూబ్‌నగర్ న్యూటౌన్: రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ కల్యాణ మండపం వద్ద మంగళవారం మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయమ్మ, మంజుల మాట్లాడుతూ రెగ్యులరైజ్ చేసి ఆదుకోవాలన్నారు. రేణుక, అనురాధ, ఎల్లమ్మ, పద్మజ, భాగ్యలక్ష్మి, గౌషియాబేగం, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి..

అదేవిధంగా సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయవర్ధన్‌రాజు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, పట్టణ కార్యదర్శి చంద్రకాంత్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా



దేవరకద్ర: మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు వద్ద డమ్మి పగిలి పోవడంతో మిషన్ భగీరథ నీరు వృథాగా పారింది. మంగళవారం సాయంత్రం ట్యాంకు పూర్తిగా నిండిన తరువాత ప్రెషర్ ఎక్కువ కావడంతో డమ్మీ పగిలిపోయింది. దీంతో ట్యాంకు అంతా ఖాళీ కావడంతో పాటు పైపులైన్ నుంచి వచ్చిన నీరు సైతం బయటకు పారింది. కొందరు ఫొటోలు తీసి గ్రూపులో వేయడంతో అప్రమత్తం అయిన సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతు చేశారు. తిరిగి ట్యాంకును నింపే పనులు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్కూల్ స్వీపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం జెడ్పీ సీఈఓ జ్యోతికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నాగరాజు, బాలరాజు, ఇస్తారయ్య, రాములు, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉపయోగకరంగా ఫంక్షన్ హాళ్లు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వివిద బస్తీలు, కాలనీల్లో పేదలకు ఉపయోగకరంగా ఫంక్షన్ హాళ్లు, కమ్యునిటీ హాళ్లు నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం క్యాంపు పలు కమ్యునిటీ హాళ్ల నిర్మాణానికి సంబంధించిన రూ. 60 లక్షల నిధుల ప్రొసిడింగ్స్‌ను ప్రజాప్రతినిధులకు అందజేశారు.

క్యాన్సర్ కణితి తొలగింపు

పాలమూరు: శ్వాసనాళంలో ప్రమాదకరంగా ఉన్న క్యాన్సర్ గడ్డను ఎస్వీఎస్ వైద్యులు విజయవంతంగా తొలగించారు. 67ఏళ్ల వ్యక్తి నెల రోజుల నుంచి శ్వాస ఇబ్బందితో పాటు ఆకలి లేక బరువు తగ్గే వంటి సమస్యలతో బాధపడుతూ మూడు రోజుల కిందట ఎస్వీఎస్ ఆస్పత్రిలోని ఊపిరితిత్తుల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ తుమ్మూరు వెంకటేశ్వర్ రెడ్డిని సంప్రదించాడు. బాధితుడికి ఛాతీ ఎక్స్‌రే, సీటీ స్కాన్ చేసి పరీక్షించగా అతని ఎడమ ఊపిరితిత్తుల గాలిగొట్టంలో పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించారు. క్యాన్సర్ అని నిర్ధారించిన తర్వాత రిజిడ్ బ్రోన్ కో స్కోపీ ప్రక్రియ ద్వారా కణితి గడ్డను తొలగించారు.

డాక్టర్ జీవన్‌కు ఘన సన్మానం

పాలమూరు: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ జీవన్‌ను మంగళవారం సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో సత్కరించారు. శాలువా పుష్పగుచ్ఛం అందజేశారు. చికిత్స కోసం వచ్చే వయోవృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు నాగభూషణం, రాజసింహుడు, శివుడు, బుచ్చన్న పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

మిడ్జిల్: ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కర్ణాటక ఎమ్మెల్యే విజయేంద్ర కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో అంసెబ్లీ ఇన్‌చార్జ్ మధుసూదన్ యాదవ్, బాలత్రిపుర సుందరి, రాపోతుల శ్రీనువాసులు, శ్యాంసుందర్‌రెడ్డి, రాజేశ్వర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో మాట్లాడుతున్న నాయకులు

ఓటరు జాబితాలో చేరికకు చివరి అవకాశం



మాట్లాడుతున్న ఆర్డీఓ అనిల్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని ఆర్డీఓ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. జాబితాలో తప్పుల సవరణ, జాబితాలో పేర్లపై అభ్యంతరాలు సెప్టెంబర్ 19వ తేదీ వరకు తెలుపవచ్చని పేర్కొన్నారు. వచ్చిన అభ్యంతరాలను సెప్టెంబర్ 28 వరకు పరిష్కరించి అక్టోబర్ 4న తుది జాబితాను విడుదల చేయనున్నామని అన్నారు. తహసీల్దార్ నాగార్జున, డిప్యూటీ తహసీల్దార్లు రాజగోపాల్, సునీల్‌కుమార్, గిర్దావర్లు చైతన్య, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: రాబోయే ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాలో లేని వారు చివరి అవకాశంగా మరోసారి దరఖాస్తులు పెట్టుకోవచ్చని తహసీల్దార్ యేసయ్య తెలిపారు. మంగళవారం మండల బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు.లిస్టులో పేర్లు రానివారు, తప్పుగా నమోదైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ యాదయ్య, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువపత్రాలు ఇవ్వొద్దని నిరసన

మహబూబ్‌నగర్ రూరల్: మదాసీ, మదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దంటూ ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో మదాసీ, మదారి కురువలు లేరన్నారు. ఇక్కడి వారు అంటరానితనం, వివక్షత, ఊరికి దూరంగా లేరని, అలాంటి వారు కుల ధ్రువపత్రాలు మాత్రం కావాలని కోరడం మూర్ఖత్వం అన్నారు. గ్రామస్థాయి నుంచి మండలం, జిల్లా స్థాయిల్లో 59 ఉపకులాలు ఏకమై రాజధాని నడిబొడ్డుపై బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ విషయంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆలోచన చేయాలని, లేకపోతే ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరమేశ్వర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య, ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) జిల్లా అధ్యక్షుడు ఎల్.రమేష్, జిల్లా ఇన్‌చార్జ్ రాజగాని అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు ప్రోత్సాహకాలు

భూత్పూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించడానికి బయోస్టెడ్ ప్రైవేట్ పెస్టిసైడ్ కంపెనీ కృషిచేస్తోందని రైతుబంధు మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్ అన్నారు. ఈ మేరకు కొత్తమొల్గర ఉన్నత పాఠశాలలో 10 మంది పదోతరగతి విద్యార్థులకు రూ.2,500 చొప్పున నగదును అందజేసినట్లు వివరించారు. కంపెనీ గ్రామంలోని పాఠశాలలోనూ ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు యువకుడు చల్లా రఘురెడ్డి కృషిచేయడం సంతోషకరమన్నారు. అవేవిధంగా వందమంది రైతులను కంపెనీ వారు శాలువా, మెమోంటోలతో సత్కరించారు. ఏఓ మురళీధర్, ఏఈఓ హర్షవర్ధన్, హెచ్ఎం రంగయ్య, కంపెనీ వైస్ ప్రెసిడెంట్ గోకుల్ దాస్‌లే, జనరల్ మేనేజర్ నవీన్ ముద్ర బట్, రిజినల్ మేనేజర్ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలను అందజేస్తున్న నర్సింహులు

సొంత డబ్బులతో పింఛన్ల పంపిణీ

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన ఆరుగురు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి ఆసరా పింఛన్లు మంజూరు కాకపోవడంతో జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి వారికి అండగా నిలుస్తున్నారు. 6 మందికి నెలకు రూ.2వేల చొప్పున సొంత డబ్బులతో పింఛన్లను అందజేస్తున్నారు. మంగళవారం సొంత డబ్బులతో పింఛన్లను అందజేశారు. అదేవిధంగా శాఖాపూర్‌లో జామియా మసీదు ప్రహరీ నిర్మాణం పనులకు ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. సీడీపీ ద్వారా రూ.4లక్షలు మంజూరు కావడంతో పనులను మొదలు పెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ జయన్నగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మహిమూద్, చంద్రమోహన్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, జాహంగీర్, అడ్వకేట్ పాష, భాస్కర్, మహేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి శ్రవణ పరికరాలు

జడ్చర్ల టౌన్: బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి యం. భార్గవికి మంగళవారం సమర్థనం దివ్యాంగుల సంస్థ హైదరాబాద్‌లోని కార్యాలయంలో 2 శ్రవణ పరికరాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ మాట్లాడుతూ సంస్థ ప్రతినిధి రంగారావుకు తెలిపి పరికరాలు ఇప్పించటంలో కృషిచేసిన కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు తిరుపతయ్య, అధిపతి డా.రమాదేవి ఈ సందర్భంగా అభినందించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

భూత్పూర్: మండలంలోని గ్రామాలల్లో బుధవారం వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించడంతోపాటు, శంకుస్థాపనలు చేయనున్నట్లు క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజయవంతం చేయాలని కోరారు.

'గృహలక్ష్మి'పై కొనసాగిన సర్వే



బాలానగర్: మండలపరిధిలో గృహలక్ష్మి దరఖాస్తులకు సంబంధించి మంగళవారం కొనసాగింది. ఎంపీడీఓ కృష్ణారావు బోడజానంపేట్, వాయిల్‌కుంట తండా, గుడిబండ తండా, నమ్యతండాలలో కార్యక్రమం కొనసాగినట్లు పేర్కొన్నారు. వివరాలు మరోమారు బుధవారం పరిశీలించి నివేదిక తయారుచేసి ఉన్నత అధికారులకు అందిస్తామన్నారు.

కలుపు మందులతో ఖర్చు తగ్గించుకోండి

రాజాపూర్: రైతులు కలుపు నివారణకు మందులు వాడి ఖర్చులు తగ్గించుకోవాలని జడ్చర్ల వ్యవసాయశాఖ ఏడీఏ అంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డిగూడ, సింగమ్మగూడ తండా, గుండ్లపొట్లపల్లి మొక్కజొన్న, వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల్లో కలుపు ఎక్కువగా ఉందని, అదేవిధంగా పత్తిలో రసంపీల్చే పురుగులు పంటలను ఆశించి నాశనం చేస్తున్నట్లు గుర్తించారు. ఆకుముడత తెగులు కూడా వస్తుండటంతో రైతులు అధికారులను సంప్రదించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల అధికారి నరేందర్, ఏఈఓ దీపికాగౌడ్, రైతులు రాందాస్, రాములు తదితరులు ఉన్నారు.



సూచనలు చేస్తున్న అధికారులు

ముఖ్యమంత్రిని కలిసిన ఆల



దేవరకద్ర: నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలి శారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యతగా పనులు చేపట్టాలి

అడ్డాకుల: మండలంలోని జాతీయ రహదారి నుంచి గుడిబండ వరకు చేపట్టిన బీటీరోడ్డు నిర్మాణం పనులను మంగళవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. నాణ్యవంతంగా చేయించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే ఆలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు భాస్కర్‌నాయుడు, జయన్నగౌడ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ మహిమూద్, మండల కోఆప్షన్ ఖాజాఫైరీ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేలకు అభినందనల వెల్లువ

నవాబుపేట: బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా ప్రకటన నేపథ్యంలో మంగళవారం మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలివెళ్లి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి అభినందనలు తెలిపారు. పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతుబంధు మండల చైర్మన్ మధుసూదన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య తదితరులు ఉన్నారు.

పరిగికి తరలివెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తలు

మహమ్మదాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి మరోమారు ఎన్నికల బరిలో నిలిచేందుకు అవకాశం రావడంతో మంగళవారం మండలానికి చెందిన నాయకులు మన్నెగూడ నుండి పరిగి వరకు నిర్వహించిన ర్యాలీకి తరలివెళ్లారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు.

నెలాఖరులోగా అడ్మిషన్లు పూర్తిచేయాలి



మహమ్మదాబాద్: మండలంలో కొత్తగా మంజూరైన జూనియర్ కళాశాలలో ఈనెల చివరి వరకు అడ్మిషన్లు పూర్తి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని పాతభవనాన్ని పరిశీలించారు. వసతులను పరిశీలించారు. ప్రస్తుతానికి సౌకర్యం బాగుందని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో చేరితే తగిన సిబ్బందిని పంపించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడి ప్రాంతం నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే విద్యార్థులను వారి అవకాశాలను బట్టి ఇక్కడికి మార్చాలని గ్రామస్తులు కోరగా నిర్ణయం తరువాత తీసుకుందామని అన్నారు. కాగా విద్యార్థులు వచ్చిన వెంటనే అధ్యాపకులను, సిబ్బందిని సమకూర్చాలని రాంలాల్ కోరారు. ఇంటర్ కార్యాలయ సూపరింటెండెంట్ సందీప్‌కుమార్‌డ్డి, స్థానిక హెచ్ఎం వెంకట్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ఇప్పటూర్ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



నవాబుపేట: మండల పరిధిలోని ఇప్పటూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కోళ్ల నర్సింహులుకు డాక్టరేట్ లభించింది. బోధన అంశాలపై ఆయన చేసిన పరిశోధనలు తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ ట్రస్ట్ ద్వారా మంగళవారం హైదరాబాద్‌లో డాక్టరేట్ ఇచ్చినట్లు సంస్థ నిర్వాహకులు హెచ్ఆర్ రహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహులును సర్పంచ్ అబ్దుల్లా, ఎంపీటీసీ నవనీత్, ఉప సర్పంచ్ రవికిరణ్ తదితరులు అభినందించారు.